క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని యడవెల్లి గ్రామానికి చెందిన బంటు వెంకన్న వృత్తిరీత్యా తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో శుక్రవారం ప్రమాదశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సొసైటీ చైర్మన్ బొడ్డు సైదులు కోరారు.

నాలుగు గేదెలు మృతి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని లక్ష్మీతండాలో విద్యుదాఘాతానికి గురై నాలుగు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. లక్ష్మీతండా శివారు ప్రాంతంలో లోనావత్ బుల్లి, లోనావత్ నీలాకు చెందిన నాలుగు గేదెలు మేత మేస్తున్న క్రమంలో అక్కడే తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

సరస్వతీ దేవికి అభిషేకం



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పిల్లలమర్రి శ్రీమహాదేవ నామేశ్వరస్వామి ఆలయం ఆవరణలోని శ్రీ సరస్వతీ దేవి సమేత బ్రహ్మ ఆలయంలో శుక్రవారం మూల నక్షత్రం, సంకటహర చతుర్థి సందర్భంగా అమ్మవారికి ఘనంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు శ్రీ చక్ర దేవతకు కుంకుమ పూజ చేశారు. నీరాజన, మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు మునగలేటి సంతోష్ శర్మ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

నాగారం : ఉపాధి కూలీలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని మండల బీఆర్ఎస్ నాయకుడు షేక్ నజీర్‌పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కన్నెబోయిన శ్రవణ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

నాగారం : నాగారం మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామానికి చెందిన కన్నెబోయిన శ్రవణ్ కుమార్తె రిత్విక్‌శ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శుక్రవారం చిన్నారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు బిల్ల సత్తిరెడ్డి మాతృమూర్తి బిల్ల లక్ష్మీనర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, నాయకులు దోమల బాలమల్లు, ఈరేటి అంజి, యారాల నర్సింహారెడ్డి, కూరం వెంకన్న, తరాల ఆంజనేయులు, జంపాల రాజు, మహేందర్, తీగుళ్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

20న వర్ధంతి సభ

అర్వపల్లి : సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జలగం జనార్దన్ 4వ వర్ధంతి సందర్భంగా జాజిరెడ్డిగూడెంలో ఈ నెల 20న సభను నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ నాయకుడు పోలెబోయిన లింగయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

కూలిన ఇల్లు పరిశీలన

అర్వపల్లి : మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో కొమ్మాలలోని ఎస్సీ కాలనీలో గోల్కొండ విజయ్ ఇల్లు కూలిపోగా శుక్రవారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి పరిశీలించారు. అలాగే గిర్దావర్ రామరాజు జలేందర్‌రావు ఆ ఇంటిని పరిశీలించి బాధితులను నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సురేందర్‌రెడ్డి

వేసవి శిక్షణకు అనూహ్య స్పందన



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో వాలీబాల్ ఆటలో శిక్షణ ఇస్తున్న పీడీ మల్లేష్



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ క్యాంపులో వాలీబాల్ ఆడుతున్న యువకులు



ఆత్మకూరులోని ప్రత్యేక క్యాంపులో క్యారంబోర్డు ఆడుతున్న విదార్థులు



కాగితాలతో వివిధ రకాల పూల వస్తువులు తయారు చేసిన విద్యార్థినులు

- సమ్మర్ క్యాంపులపై ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు

అర్వపల్లి : సమ్మర్ క్యాంపునకు అనూహ్య స్పందన లభిస్తోంది. అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లా యువజన క్రీడల సమాఖ్య, తెలంగాణ రైజింగ్ ఆధ్వర్యంలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 2న ఈ శిబిరం ప్రారంభమైంది. జాజిరెడ్డిగూడెం మండలంతోపాటు చుట్టుపక్కల ఉన్న శాలిగౌరారం, తుంగతుర్తి, నాగారం, మండలాల నుంచి కూడా యువకులు, బాలబాలికలు ఇక్కడికి వచ్చి శిక్షణ పొందుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, క్యాంపు ఇన్‌చార్జ్ పి.మల్లేష్ శిక్షణ ఇస్తున్నారు.

రోజుకు 100 నుంచి 150 మంది..

అర్వపల్లిలోని వాలీబాల్ శిక్షణ శిబిరానికి 100 నుంచి 150 మంది వరకు వచ్చి శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వంతోపాటు బిగ్‌హెల్ప్ సంస్థ కూడా తగు సహకారం అందిస్తోంది. ఇప్పటికే పిల్లలకు కావాల్సిన 20 వరకు బాల్స్‌ను, నెట్‌లను ఏర్పాటు చేశారు. శిక్షణకు వచ్చే వారికి బిగ్‌హెల్ప్ సంస్థ తగు వసతులు కల్పిస్తోంది. పీడీ మల్లేష్ దగ్గరుండి పిల్లలకు తగు సలహాలు, సూచనలిస్తూ శిక్షణ ఇస్తున్నారు.

సమ్మర్ క్యాంపులతో నైపుణ్య అభివృద్ధి

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని ఆత్మకూర్, ఏనుబాముల, ఏపూరు గ్రామాలలోని ఆయా పాఠశాలల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని క్యాంపులకు విద్యార్థిని, విద్యార్థులు వచ్చి తమకు ఇష్టమైన కలలను ఎంచుకొని వాటిల్లో తమ ప్రతిభను చూపిస్తున్నారు.

ఇండోర్ గేమ్స్‌పై మక్కువ..

ఎండాకాలం ఎండలు తీవ్రంగా ఉండడంతో క్యాంపులకు వచ్చే పిల్లలు ఎక్కువగా ఇండోర్ గేమ్స్‌పై మక్కువ చూపుతున్నారు. వాస్తవానికి క్యాంపులలో కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడలు కూడా పరిచయం చేయాల్సి ఉండగా ఎండల తీవ్రత ఎక్కువ ఉండటంతో క్యారం, చెస్ లాంటి ఆటలపైనే విద్యార్థులు దృష్టి పెడుతున్నారు. అంతేకాకుండా అమ్మాయిలు అల్లికలు, పేపర్లతో వివిధ రకాల వస్తువులను తయారు చేస్తూ తమ అభిరుచిని చాటుతున్నారు. మరికొందరు విద్యార్థినులు టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్, ముగ్గులు, అల్లికలు, బొమ్మల తయారీపై శ్రద్ధ చూపుతున్నారు.

విద్యార్థులకు స్నాక్స్ సౌకర్యం..

వేసవికాలంలో ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక క్యాంపులకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. క్యాంపులకు వచ్చి తమ ప్రతిభను మెరుగుపరుచుకునే విద్యార్థులకు తాగు నీటి సౌకర్యంతోపాటు అల్పాహారం అందిస్తోంది. దీంతో రోజురోజుకూ ఈ ప్రత్యేక వేసవి క్యాంపులకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎండాకాలంలో విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా ఉండడంతోపాటు తమ అభిరుచిని చాటుతూ వివిధ రకాల అంశాలలో ప్రావీణ్యత పొందుతున్నారని ఉపాధ్యాయులు అంటున్నారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది



సాధారణ పాఠశాల సమయంలో కంటే ప్రత్యేక కాంపులలో విద్యార్థులు తమకు ఇష్టమైన అంశాలపై దృష్టి పెట్టి ప్రతిభను చాటుతున్నారు. విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంది. ప్రత్యేక క్యాంపుల ద్వారా విద్యార్థుల ఆసక్తి, ప్రతిభను తెలుసుకోగలుగుతున్నాం. రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

– శ్రవణ్‌కుమార్, హెచ్ఎం, ఆత్మకూర్(ఎస్)

వాలీబాల్ నేర్చుకుంటున్నాను



అర్వపల్లి క్యాంపులో వాలీబాల్ నేర్చుకుంటున్నాను. వేసవి సెలవుల్లో ఎండలలో తిరగకుండా ఈ శిక్షణ ఇవ్వడం బాగుంది. నాతోపాటు నా స్నేహితులు కూడా ఆ శిబిరానికి వచ్చి నేర్చుకుంటున్నారు.

– ఫాతిమా, విద్యార్థిని

శిక్షణ బాగుంది



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఇచ్చే వాలీబాల్ శిక్షణ ఎంతో బాగుంది. పీడీ తగు విధంగా మా యూత్‌కు శిక్షణ ఇస్తున్నారు. నాతోపాటు 20 మందికి పైగానే ప్రతి రోజు శిక్షణకు వెళ్తున్నాం. బిగ్‌హెల్ప్ సంస్థ మాకు సౌకర్యాలు కల్పిస్తోంది.

– ఈద కోటిప్రసాద్, విద్యార్థి

శిక్షణను వినియోగించుకోవాలి



జిల్లా యువజన క్రీడల సమాఖ్య, తెలంగాణ రైజింగ్‌ల ఆధ్వర్యంలో బిగ్‌హెల్ప్ సంస్థ సహకారంతో వాలీబాల్ శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. 150 మంది వరకు పిల్లలు వస్తున్నారు. 18 ఏళ్లలోపు వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఇప్పటికే స్థానిక జెడ్పీహెచ్ఎస్ పిల్లలు రాష్ట్ర స్థాయిలో పలు బహుమతులు సాధించారు.

– పి.మల్లేష్, పీడీ, క్యాంపు ఇన్‌చార్జ్

వీరన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



సూర్యాపేట అర్బన్ : మారోజు వీరన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు



తుంగతుర్తి : కొత్తగూడెంలో మారోజు వీరన్న స్థూపం వద్ద మాట్లాడుతున్న గాజుల శ్రీను

సూర్యాపేట అర్బన్ : మారోజు వీరన్న ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఆర్ఎం) రాష్ట్ర కార్యదర్శి చామకూరి నరసయ్య అన్నారు. శుక్రవారం బహుజన సిద్ధాంతకర్త మారోజు వీరన్న 26వ వర్ధంతిని పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న భీంరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద మారోజు వీరన్న స్మారక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక అసమానతలు లేని మానవ ప్రపంచాన్ని నిర్మించడమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రామచంద్రన్ వర్గం అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, నాయకులు వెంకన్న, రాములు, సోమయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి : వర్గ కుల పోరాట సిద్ధాంతకర్త, మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకుడు మారోజు వీరన్న అని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు గాజుల శ్రీను అన్నారు. శుక్రవారం మారోజు వీరన్న 26వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని కొత్తగూడెంలో మారోజు వీరన్న స్తూపం వద్ద విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు, లింగయ్య, రాంబాబు, చైతన్య, మాంద్ర మల్లయ్య, బత్తుల వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మారోజు వీరన్న 26వ వర్ధంతిని శుక్రవారం తిరుమలగిరిలో సామాజిక తెలంగాణ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో మారోజు వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన బహుజన కెరటం మారోజు వీరన్న అని అన్నారు. వందలాది కుల సంఘాలకు దారి చూపిన దార్శనికుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి సోమయ్య, కడెం లింగయ్య, కందుకూరి ప్రవీణ్, బ్రహ్మం, కందుకూరి శ్రీను, సామయ్య చారి, ఉపేంద్ర చారి, కందుకూరి రమేష్, విజయ్ నాయక్, అనగందుల మల్లేష్, సంఘపాక రవి, చిరంజీవి, కందుకూరి శ్రీను, అంబేద్కర్, దాసు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలో శుక్రవారం బహుజన విప్లవోద్యమకారుడు మారోజు వీరన్న 26వ వర్ధంతిని పూలే–అంబేద్కర్ ఆశయపోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య, నాయకులు కె. పర్వతాలు, గాజుల శ్రీనివాస్, లింగయ్య, కాశీరాం, సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా కన్వీనర్ దడిపల్లి వెంకట్, ఇమ్మడి సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, యల్లయ్య పాల్గొన్నారు.



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు



అర్వపల్లిలో..

సంక్షిప్త సమాచారం

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు మర్రిగూడకు బదిలీ కావడంతో అతడిని శుక్రవారం కార్యాలయంలో డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానంద చారి సన్మానించారు. సన్మానించిన వారిలో మండల కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్‌ల అధ్యక్షులు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, గిరిబాబు, కుంభం రణధీర్, శ్రీధర్‌రెడ్డి, సంతోష్, ఉపేందర్, ఉప్పలయ్య, రమేష్, శ్రీకాంత్, యాదగిరి, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

నాగారం : గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కళాబృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల, కోమటిపల్లి, జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్ గ్రామాలతోపాటు వాటి పరిధిలోని ఆవాస గ్రామాలలో శుక్రవారం పశు వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పశువులకు టీకాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, వీఎల్‌ఓ కేఎస్ఎస్ పద్మ, సిబ్బంది మధుసూదన్, యాకయ్య, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



కొనుగోళ్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : కాంటాలను వేగవంతంగా పూర్తి చేసి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయినిగూడెం –2, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలెంల-2, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యర్కారం, పిల్లలమర్రి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 90 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. లారీలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తామని, అకాల వర్షాలకు వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని మూడు రోజులలో కాంటాలు వేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. ఇప్పటివరకు రాయినిగూడెం –2 కొనుగోలు కేంద్రం నుంచి 6220 క్వింటాలు, ఐకేపీ బాలెంల –2 నుంచి 17000 క్వింటాలు, పీఏసీఎస్ పిల్లలమర్రి నుంచి 13,333 క్వింటాలు, యర్కారం నుంచి 17000 క్వింటాల ధాన్యం మిల్లులకు తరలించినట్లు సంబంధిత నిర్వాహకులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయన తిరుమలగిరి మండలంలోని ఏఎస్ఆర్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని లారీల నుంచి వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ మెప్మా ఇన్‌చార్జ్ కాసం రేణుక, తహసీల్దార్లు శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీనివాస్, సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఫణీమా, పుష్పలత, వెంకటరెడ్డి, సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



అర్వపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అర్వపల్లిలో స్థానిక పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్‌నాయక్, సీహెచ్‌ఓ ఎం. బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, ఎల్‌టీ చొక్కయ్య, సిబ్బంది అక్కెనపల్లి మాధవి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి లిఖిత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ప్రమాదకరమైన డెంగీ వ్యాధిని నిర్మూలించడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చరణ్, పీహెచ్ఎన్ తారమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగారం : డెంగీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణవీ, హెల్త్ ఎడ్యుకేటర్ విమల, పీహెచ్ఎన్‌ఓ అరుణకుమారి, ఎస్ఎన్‌ఓ సుజాత, సూపర్‌వైజర్లు రామచంద్రం, నాగమ్మ, సంధ్య, రోజా, రేణుక, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతనకల్‌లో..



నాగారంలో..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ చంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో మోడల్‌స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సూర్యకాంతం, ఉపాధ్యాయులు వేముల బాలరాజు, సోమసుందర్, ఆర్.నాగరాజు, అశోక్, మహేష్, స్వయం సహాయక సంఘం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కోడి లింగయ్య అన్నారు. పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల అనాజీపురం ఉపాధ్యాయులు శుక్రవారం అనాజీపురం, అనంతారం గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలను ఆదర్శ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రాల సోమయ్యగౌడ్, రాజయ్య, లక్ష్మీనారాయణ, లింగయ్య, శైలజ, అంజుమ్ పాల్గొన్నారు.

మద్దిరాల : పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేపాక లింగయ్య అన్నారు. శుక్రవారం ముకుదాపురం గ్రామంలో ఉపాధిహామీ పనుల ప్రదేశంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్వాయి నాగయ్య, నాగేష్, విజయ్, పూర్వ విద్యార్థులు సాయి గణేష్, జయవర్దన్, శ్రావ్య, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లికి చేరిన పాదయాత్ర

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్రసాధన కోసం పోరాడిన మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరుతూ కొత్తగూడెంలోని మారోజు వీరన్న స్థూపం వద్ద నుంచి ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం అర్వపల్లికి చేరింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సామ అంజిరెడ్డి, పాదయాత్ర బృందం సభ్యులు భూపతి కొమరయ్య, వేల్పుల రాములు, పాక సోమయ్య, రహమాన్‌అలీ, తెలంగాణ ఉద్యమ నాయకులు దిర్శనపు కృష్ణమూర్తి, దడిపల్లి వెంకట్, లింగంపల్లి రమణ, ఈదురు వీరపాపయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన వారికే పదవులు



పెన్‌పహాడ్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న పరిశీలకుడు మురళీనాయక్



ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్‌లో మాట్లాడుతున్న మురళీనాయక్

పెన్‌పహాడ్ : కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకే పదవులు వస్తాయని టీపీసీసీ పరిశీలకుడు, మహబూబాబాద్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల శాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షుల పదవుల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పోరాడిన వారు అర్హులవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అనంతరం పలువురు కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, పరిశీలకుడు చత్రురావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మిడిమేలపు దామోదర్‌రెడ్డి, అడ్డి కేశవులు, చకిలం రాజేశ్వర్‌రావు, జంగారెడ్డి, అభినయ్, పద్మ, పిన్నాని కోటేశ్వర్‌రావు, పానుగోటి నరేందర్, సందీప్‌రాథోడ్, శివనాయక్ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : పార్టీ అభివృద్ధి, పార్టీ ప్రతిష్ట కోసం పనిచేసిన కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. శుక్రవారం నెమ్మికల్ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం గ్రామస్థాయి నుంచి జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆదేశాల మేరకు పార్టీ కోసం పనిచేసిన వారికి స్థాయికి తగ్గ పదవులు దక్కుతాయని అన్నారు. అర్హులైన వారు గ్రామ, మండల, బ్లాక్ అధ్యక్ష స్థానాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2017 కంటే ముందు పార్టీ కోసం పనిచేసిన వారికి పార్టీ పదవులలో అధిక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కందాల వెంకటరెడ్డి, చకిలం రాజేశ్వరరావు, జ్ఞానసుందర్, చంద్రారెడ్డి, కాకి కృపాకర్ రెడ్డి, రాజేష్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, గణపరపు నారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం, అర్వపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ జలేందర్‌రావు, పీఏసీఎస్ సీఈఓ మేడెబోయిన రామస్వామి, నిర్వాహకులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



అర్వపల్లి : రామన్నగూడెంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని తరలించడం కోసం అదనపు లారీలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల, పెదనెమిల, దిర్శనపల్లి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కాంటా వేసిన బస్తాలు తడవడంతో తడిసిన బస్తాలను బాయిల్డ్ మిల్లులకు ప్రత్యేకంగా తరలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళి, ఆర్ఐ హసన్‌అలీ, ఏపీఎం రమణాకర్, సీసీ ముత్తయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తపడాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

తుల్జారావుపేట వాసికి డాక్టరేట్



రవీందర్

చివ్వెంల : మండల పరిధిలోని తుల్జారావుపేట గ్రామానికి చెందిన బానోతు రవీందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ బి. మంగు, డి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

'సీఎం క్షమాపణ చెప్పాలి'

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మహిళలతో సుందరీమణుల కాళ్లను కడిగించడం హేయమైన చర్య అని, కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలపై గౌరవం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆడపడుచులను కించపరిచిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.